విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- అభివృద్ధి పనులకు నిధులు మంజూరు
- చంద్రుగొండ పర్యటనలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


కేజీబీవీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ: నియోజకవర్గంలో తొలుత విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో మౌలిక సదుపాయాలకు మంజూరైన రూ.47.50 లక్షల అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో డ్రెయిన్ పనులకు రూ.18 లక్షలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, బీసీ బాలికల వసతిగృహంలో రోడ్డు నిర్మాణానికి రూ.7 లక్షలు, విద్యుత్ సబ్‌స్టేషన్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.7.50 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం మహిళాశక్తి పథకం ద్వారం పొదుపుసంఘాలకు మంజూరైన రూ.8 లక్షల రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పడకలు సరిపోవడం లేదని వైద్యాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన.. మరో పది పడకలు మంజూరీకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల వివరాలు తెలుపుతూ ప్రతిగ్రామంలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే పర్యటనలో ఎంపీడీఓ బి.అశోక్, డాక్టర్లు కనకం తనుజా, వెంకటప్రకాష్, ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యానాయక్, నల్లమోతు రమణ, ఉప్పతల ఏడుకొండలు, కృష్ణారెడ్డి, బి.కోటేశ్వరరావు, ఎస్డీ రసూల్ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావంతో మెలగాలి


అశ్వారావుపేట: మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేట: విద్యార్థులు సమాజం పట్ల సేవాభావాన్ని కలిగి ఉండాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ సూచించారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన జాతీయ సేవా పథక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సమాజ సేవ, పరిసరాల పరిశుభ్రత, చెట్ల పెంపకం, ఆరోగ్య, రక్తదాన శిబిరాలు, అవగాహనా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.గోపాలకృష్ణ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ ఆర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ పి.రెడ్డిప్రియ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం ప్రభుత్వ కళాశాలలో..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సీహెచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. వరదలు, జాతర్ల సమయంలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సీనియర్ తెలుగు అధ్యాపకులు కేపీడీ వర రాజు, బోటనీ అధ్యాపకులు పవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాసరావు, విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపాడు: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కృష్ణసాగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ధర్మాచారి తెలిపారు. మంగళవారం ఓ ప్రకటనలో ఐటీఐలో ప్రవేశాల కోసం 5వ విడత అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫామ్, ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఏ కళాశాలలో సీటు పొందాలనుకుంటే ఆ కళాశాలలో హాజరు కావాలన్నారు. గతంలో సీటు పొందిన అభ్యర్థులు ట్రేడ్‌లు మార్చుకునేందుకు కూడా అవకాశాలున్నాయని తెలిపారు.

కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్


ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రథమశ్రేణి కోర్టు సముదాయం ఆవరణలో మంగళవారం న్యాయమూర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో న్యాయవాదులు చెత్తా, చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్‌ను నిర్వహించుకున్నట్లు తెలిపారు. అనంతరం భద్రాచలం పట్టణంలోని సబ్ జైలును ఆయన సందర్శించి, ఖైదీలకు అందిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు ఆరోగ్య కరమైన భోజనాన్ని అందజేయాలని అక్కడి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, ఏజీపీ శ్రీనివాస్, న్యాయవాదులు పామరాజు తిరుమలరావు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంఅర్బన్: జర్నలిజంపై ఆసక్తితో పాత్రికేయ వృత్తిలోకి వచ్చిన ప్రతి జర్నలిస్టు వృత్తి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 26, 27 తేదీల్లో భద్రాచలం పట్టణంలో నిర్వహించే పాత్రికేయుల వృత్తి శిక్షణ తరగతులకు సంబంధించి కరపత్రలను మంగళవారం ఆయన కార్యాలయంలో ఏఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టు రాసే ప్రతి వార్త సమాజ హితానికి అద్దం పట్టేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు డి.రవికుమార్, జిల్లా నాయకులు పుష్పగిరి పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా..

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం ప్రభుత్వ పాఠశాలలో మున్సిపాలిటీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రం, వ్యక్తిగత శుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేసే విధానాలపై మున్సిపల్ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత పై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంక్ సమీపంలోని పబ్లిక్ టాయిలెట్ల వద్ద మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వర్గానికి అన్యాయం'

మణుగూరుటౌన్: లాభాల వాటా పంపిణీలో కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం రైల్వే గేట్ కూనవరం దగ్గర టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగేల్లి మాట్లాడుతూ.. సింగరేణిలో 33శాతం కార్మికులకు లాభాల వాటా ప్రకారం 155 కోట్లు కార్మిక వర్గానికి చెల్లించాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం 796 కోట్లు మాత్రమే చెల్లిస్తోందన్నారు. మిగతా 755 కోట్లు సింగరేణి అభివృద్ధి భవిష్యత్ తరాలకు వాడతామని చెప్పడం సరైంది కాదన్నారు. ఇజ్రాయిల్, బంగారి పవన్ కుమార్, మునిగెల నాగేశ్వరరావు, ఆపరేటర్ ముకేశ్, ఇమ్రాన్, సందీప్, మురళీ కృష్ణ, రాజేశ్, భరత్, సురేశ్ నాయుడు, సుమన్ ఉన్నారు.

ముక్తార్ పాషా వర్ధంతి

బూర్గంపాడు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్రకమిటీ నాయకులు ముక్తార్‌పాషా 4వ వర్ధంతి సభను మంగళవారం చింతా లక్ష్మీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ నాయకురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, పీఓడబ్ల్యూ డివిజన్ కార్యదరి సున్నం భూలక్ష్మి మాటాడారు. పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం ప్రణయ్, రాపర్తి లక్ష్మి, కణతాల ధనలక్ష్మి, కొడిమి రాధ, బుర్రా సంధ్య, వర్సిక వెంకటరమణ,మర్ల కృపారాణి, బండ్ల కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను ప్రచారం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న తపాలా శాఖ సూపరింటెండెంట్ వీరభద్ర స్వామి

పినపాక: తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలపై గ్రామీణ గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆ శాఖ ఖమ్మం జిల్లా ఎస్పీ (సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్స్) వీరభద్ర స్వామి అన్నారు. ఉప్పాక వంతెన వద్ద ఓ ప్రైవేటు వేదికలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న మొత్తాల పొదుపు, జీవిత బీమా, సుకన్య సమద్ధి యోజన పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకు తరహా సేవలందిస్తున్న ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఖాతాలను తెరవాలన్నారు. తపాలా శాఖ అందిస్తున్న బీమా పథకాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. చిన్న మొత్తాల పొదుపు వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ రాజేష్ మణుగూరు సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రామమూర్తి, ఎంఓలు సత్యనారాయణ, సుధీర్ తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి చెక్కు అందజేత


బాధితులకు చెక్కు అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బాధితుడికి ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఐటీడీఏ ట్రైబల్ రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. దుమ్ముగూడెం మండలం, మంగవాయి భడవ గ్రామానికి చెందిన పోడియం సురేష్‌కు రూ.25 వేల చెక్కు అందించి వసతి ఏర్పాటు చేసుకోవాలని పీఓ సూచించారు. కార్యక్రమంలో ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, పోడియం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి సీపీఐ సహకారం

అశ్వారావుపేట: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి అశ్వారావుపేట సీపీఐ నాయకులు సహకారం అందించారు. అశ్వారావుపేటలో నల్లమల గిరిప్రసాద్ నగరకు చెందిన రామబ్రహ్మాచారి కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సయ్యద్ సలీం సూచన మేరకు సీపీఐ నాయకులు 25కిలోల బియ్యం, రూ.2500 నగదు సహాయం చేశారు. బాధితుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గన్నిన రామకృష్ణ, విజయ్‌కాంత్, సత్యం, చెన్నారావు, అబ్బాస్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి 'వసుధ' చేయూత

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌కు చెందిన గిరిజన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మెడెం వంశీకి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ.30 వేల చెక్కును హైదరాబాద్‌లో మంగళవారం అందజేశారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

కుల నిర్మూలనకు కృషి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కుల నిర్మూలన కోసం కృషిచేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు బండారి ఐలయ్య, ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరావులు పిలుపునిచ్చారు. సత్యశోధక సమాజ్152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని కాచనపల్లి గ్రామంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, కమ్యూనిస్టు నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోరం సీతారాములు, పూనెం రంగయ్య, బట్టు ప్రసాద్, డి.ప్రసాద్, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరప రాజేష్, పర్షిక రవి, కల్తి వెంకటేశ్వర్లు, బత్తిని సత్యం శేఖర్ లాజర్ యాసారపు వెంకన్న, భూషణం, ఈసం కృష్ణ, లాలు, వీరన్న, భద్రక్క, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అపరాల సేద్యంపై అవగాహన

చంద్రుగొండ: అపరాల పంటల సేద్యంపై చంద్రుగొండలోని రైతువేదికలో మంగళవారం రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. పెసర, మినుములు, కంది పంటల సేద్యంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఏడీఏ పి.రవికుమార్, ఏఓ వినయ్, ఏఈఓలు శ్రీనివాస్, సాయిభాను, అరుణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

అన్నపురెడ్డిపల్లి: ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించాలని పీఆర్‌టీయు జిల్లా ప్రధాన, కార్యదర్శి బి.రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రగుంటలో జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, పీఆర్‌సీలను వెంటనే ప్రకటించాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన మండలాధ్యక్షుడుగా జీఏ.జయకర్, ప్రధాన కార్యదర్శిగా డి.రమేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా చల్లా భాస్కర్, ఉపాధ్యక్షుడుగా బి.వెంకటేశ్వర్లు ఎన్నుకున్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం


మహేష్‌గౌడ్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న దుర్గాప్రసాద్ తదితరులు

చర్ల: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ గౌడ్‌ను మంగళవారం భద్రాచలం నియోజకవర్గ టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి జ్ఞాపికను, లడ్డూ ప్రసాదాలను అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నల్లపు దుర్గాప్రసాదరావు స్థానిక పరిస్థితులను మహేష్‌గౌడ్‌కు వివరించారు. మహేష్‌గౌడ్‌ను కలిసిన వారిలో నల్లపు దుర్గాప్రసాదరావుతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మెన్ డాక్టర్ రవికుమార్, జిల్లా నాయకులు తిరుమల, బానోత్ వెంకటేష్, సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమాలపై నిగ్గు తేల్చాలి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని మెప్మాలో సీఓగా పనిచేస్తున్న నాజర్ డ్వాక్రా సంఘాల్లో బాకీ ఉన్నా సంఘాలకే లోన్లు ఇప్పించి ఆర్పీలను బలిపశువులను చేశాడని బాధితులు రావుల రామకృష్ణ, శ్రీదేవిలు ఆరోపించారు. రెండు రోజులుగా మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న బాధితులు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. నాజర్ ఒకే సంఘంలో ఉన్న వారి పేర్లు మరో సంఘంలో పెట్టి డ్వాక్రా లోన్లు తీసుకున్నాడని ఇలా రూ.43 లక్షలకుగా మోసగించాడని ఆవేదన వ్యక్తం చేశారు జిల్లా ఉన్నతాధికారులు నాజర్‌పై సమగ్ర విచారణ జరిపించి మెప్మాకు సరెండర్ చేయాలని కోరారు.

నేడు సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ

గుండాల: ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా సూకరించిన మట్టి నమూనాలకు సంబంధించి రైతు వేదిక వద్ద హెల్త్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భూసార పరీక్ష ఆవశ్యకత, మట్టి నమూన సేకరణ, సాయిల్ హెల్త్ కార్డుల ఉపయోగంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని తహసీల్‌లో తహసీల్దార్ ఎం అశోక్ కుమార్ అధ్యక్షతన మండల బీఎల్‌ఓల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌస్ టూ హౌస్ సర్వేనకు సంబంధించి ఓటర్ వివరాలు సేకరణ, ఫాంలు తదితర వాటి గురించి వివరించారు. అనంతరం బీఎల్‌ఓలకు పరీక్ష నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడ్యా వెంకటేష్ నాయక్ అధ్యక్షతన మంగళవారం కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా బోడ వీరేంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శి భూక్యా రమేష్ నాయక్, ఉపాధ్యక్షుడిగా కిషన్ నాయక్, కార్యదర్శిగా అజ్మీర నవీన్ నాయక్, గౌరవ అధ్యక్షుడిగా భూక్య రవి నాయక్, అధికార ప్రతినిధిగా వాంకుడోత్ తావు నాయక్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బండారిగూడెం సెంటర్, ఆదర్శనగర్‌లో రోడ్డుకు ఇరువైపులా మట్టితో రోడ్డు మూశారని దరఖాస్తు ఇచ్చి మూడు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. సమావేశంలో నాయకులు సోంది కుటుంబరావు, నాయకులు ఎస్వీ నాయుడు, తోట రమేశ్, జక్కుల రాజబాబు, రాయల భిక్షం, కొత్తపల్లి సీతారాములు, రాములు, పోశెట్టి సంపత్, కన్నెబోయిన ప్రసాద్, ఉపేందర్, రాములు, దశరథం పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరందించాలి

ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్ చివరి ఆయకట్టు వరకూ సాగు నీరందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిధిలోని కంపగూడెం, రంగాపురం గ్రామశాఖల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుకు కాలువ గండ్లు పూడ్చి, సక్రమంగా నీరుపారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలుత గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, మంచాల సారయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, జోగయ్య పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐటీసీ బంగారు భవిష్యత్ వాష్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీడబ్ల్యూలకు ఘన, ద్రవ పదార్థాల నిర్వహణపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఐటీసీ ఎంఎస్‌కే వాష్ సంస్థ వారు మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు,ఇంకుడు గుంతలు కచ్చితంగా ఉండాలని, తడి, పొడి చెత్త వేరు చేయాలని తెలిపారు. గ్రే వాటర్ నిర్వహించకపోతే వచ్చే సమస్యల గురించి వివరించారు. అనంతరం వాటికి సంబంధించిన ఐఈసీ పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీఓ రామకృష్ణ, ఏపీఓ సుకన్య, ఐటీసీ ఎమ్మెస్ కె.వాష్ ప్రోగ్రాం పీఓ గీత, సాగర్ వాష్ ప్రోగ్రాం ఏపీఓ సునీల్ బాబు, వెంకటేశ్వర్లు వెంకటరావు, రాజ్ కుమార్, ప్రమోద్, ప్రసాదు, సాంబ, సందీప్, జంపరాజు, పంచాయతీల కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి పనిచేయాలి


వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

పినపాక: గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక అధికారులు పనిచేయాలని డీపీఓ చంద్రమౌళి అన్నారు. మంగళవారం పినపాక మండలంలో డీఎల్‌పీఓ సుధీర్ కుమార్‌తో కలిసి మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. భూపాలపట్నం, పినపాక, జానంపేట గ్రామపంచాయతీలను సందర్శించి చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి తయారు చేసే ఎకో బ్రిక్స్ తయారీని సైతం ఆయన పరిశీలించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించేటట్లు చూడాలని ఆ చెత్తలో ప్లాస్టిక్‌ని వేరుచేసి ఎకో బ్రిక్స్‌గాను, కంపోస్ట్ గాను తయారు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఇంటి పన్ను వసూలు విధానంలో జాప్యం లేకుండా చూడాలని ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో వారంలో రెండు రోజులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

మణుగూరురూరల్: మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో మండల పరిధిలో సాంబాయిగూడెం గ్రామం వద్ద మణుగూరు సీఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు.

మణుగూరు-ఏటూరునాగారం ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు సంబంధిత పత్రాలను పరిశీలించారు. పెండింగ్ చలాన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా తారసపడితూ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఆళ్లపల్లి మండలంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. మండల కేంద్రంతో పాటు మర్కోడు, అనంతోగు గ్రామాల మధ్య ప్రధాన రహదారులపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలను పరిశీలించారు. పెండింగ్ చలాన్లు ఉన్న వాహనాలకు వెంటనే చెల్లించాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై రతీష్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై కళాజాతా

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం కళాజాతా నిర్వహించారు. దీనిద్వారా సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాజాతా టీం లీడర్ ముత్యం, కళాకారులు పమ్మి రవి, పాగి వెంకన్న, గోవింద గురవయ్య, వెంకట్, ఈజీఎస్ టీఏలు రేఖ, భద్రం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు


బూర్గంపాడు: క్రీడల్లో గెలుపొందిన జట్టుకు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జోనల్‌స్థాయి (బూర్గంపాడు, పాల్వంచ, ములకలపల్లి మండలాల) క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. జోనల్ స్థాయి క్రీడాపోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామని జోనల్ క్రీడల ఇన్‌చార్జ్ రవిలా అన్నారు. జోనల్ స్థాయి క్రీడల ముగింపు సభకు హాజరైన తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి మెమోంటోలు, సర్టిఫికెట్స్, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విద్యాసాగర్, పీడీ వేణుగోపాల్, సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. పోటీల్లో దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య, జోనల్ స్థాయి కన్వీనర్ ఆర్లగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ బహుమతి ప్రదానం చేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26, 27 తేదీల్లో కొత్తగూడెంలో జిల్లా స్థాయి ఆటల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీ దశం బాబు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్స్ గోపాల్‌రావు, వెంకట్ నారాయణ, నాగేశ్వరరావు వివిధ మండలాల పీడీలు వసంత్, వెంకట్, కెజియా, శ్రీను, వెంకటరమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: జోనల్ స్థాయి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా గెలుపొందాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని స్థానిక గిరిజన సంక్షేమ గురుకులంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రీడాపోటీలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల జోనల్ గేమ్స్‌ను ఎంఈఓ సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడల్లో 220 మంది విద్యార్థులు వివిధ క్రీడలలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆనంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, హెచ్ఎంలు వాజీద్, లక్ష్మీనర్సయ్య, పీడీ సృజన తదితరులు పాల్గొన్నారు.